ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 29 జూన్ 2024



దిల్ రుబా ఆఖరి కళాకారుడు
శ్రీనివాసరావు మృతి

వెంకటగిరి టౌన్, జూన్ 28 : వెంకటగిరికి చెందిన అరుదైన దిల్‌రుబా వాయిద్య కళాకారుడు శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన వయసు 104 సంవత్సరాలు. రాయదుర్గంలోని తన మేనల్లుడు డాక్టర్ గోపాల్ వద్ద కొంతకాలంగా ఉంటున్న శ్రీనివాసరావు గురువారం రాత్రి ఆఖరిశ్వాస విడిచారు. హిందుస్థానీ వాయిద్యం అయిన దిల్‌రుబా మీద కర్ణాటక సంగీతాన్ని పలికించడం శ్రీనివాసరావు ప్రత్యేకత. ఉత్తర భారతదేశంలోనే అరుదైన ఈ సంగీత వాయిద్యాన్ని దక్షిణభారతదేశంలో వాయించే ఆఖరి కళాకారుడు ఈయన. వయోలిన్, జలతరంగిణి, హార్మోనియం, కీ-బోర్డు ల్లోనూ శ్రీనివాసరావు దిట్ట. 1933 నుంచి వెంకటగిరిలోని అమెచ్యూర్ ఆర్టిస్ట్ అసోసియేషన్, వెంకటగిరి ఆర్ట్స్ థియేటర్, కల్చరల్ ఆర్ట్ థియేటర్స్, నట సమాఖ్య, ఆజాద్ అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ వంటి సంస్థల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 1940-50 మధ్య వెంకటగిరి క్లబ్ కార్యదర్శిగా పది సంవత్సరాలు సేవలందించారు. పంచాయతీ బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. ఎస్వీబీసీ మాజీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధారకు హార్మోనియం సహకారం అందించారు.ఆచార్య ఆత్రేయతో మంచి సాన్నిహిత్యం ఉండేది. శ్రీనివాసరావు సంగీతమే ఊపిరిగా జీవించారు. పెళ్లి చేసుకోలేదు. కొన్నేళ్లుగా మేనల్లుడి వద్ద ఉంటూ గురువారం కన్నుమూశారు.

తిరుమల ఘాట్‌లో
కలకలం



ఏనుగుల సంచారంతో శుక్రవారం సాయంత్రం తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో కలకలం రేగింది. ఏడవమైలు వద్ద 10ఏనుగులతో పాటు 3గున్న ఏనుగులు రోడ్డు సమీపానికి రావడం గమనించిన యాత్రికులు హడలిపోయారు.టీటీడీ ఫారెస్ట్ సిబ్బంది శబ్దాలు చేయడంతో 20 నిమిషాల తర్వాత ఏనుగులు అడవిలోకి వెళ్లిపోయాయి.మళ్లీ రాత్రి 8-9గంటల నడుమ మరోసారి ఏనుగుల గుంపు రోడ్డు సమీపానికి రాగా అడవిలోకి తరిమి వేసినట్లు అధికారులు తెలిపారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి



వర్సిటీల్లో రాజీనామాల పర్వం

- వేద,ద్రావిడ,ఎస్వీ విశ్వవిద్యాలయాల్లో వీసీ పదవులను వీడిన ప్రముఖులు
- వారంలో రాజీనామాలకు ఆమోదం
- తర్వాతే ఇన్‌చార్జులను నియమించే అవకాశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలకు నియమితులైన వీసీలు, రిజిస్ట్రార్లు పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవికి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా సమర్పిస్తున్నట్లు ఉన్నత విద్య కార్యదర్శికి పత్రాన్ని పంపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యులుగా ఉన్న మధుజ్యోతి 2023 డిసెంబరు 29న వీసీగా బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ వైసీపీ నాయకుల అండతో రిజిస్ట్రార్‌గా పదవి పొందిన ఏకే వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 4న రాజీనామా చేశారు. అప్పట్లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా మాధవ నాయుడిని వీసీ నియమించారు. ఆ మరుసటిరోజు రెక్టార్ అనురాధ కూడా రాజీనామా చేశారు. ఆమె స్థానంలో కొత్త రెక్టార్ నియామకం ఇంకా జరగలేదు. వేద విశ్వవిద్యాలయ వీసీ రాణీసదాశివమూర్తి తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు.ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గతంలోనే రిజిస్ట్రార్ హుస్సేన్ చేసిన రాజీనామాకు ఆమోదం లభించింది. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్యను నియమించారు. నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ వీసీ సుందరవల్లి రాజీనామా చేశారు. ఈమె ఎస్వీయూ ఇంగ్లీషు విభాగంలో అధ్యాపకురాలిగా మరికొంత కాలం కొనసాగేందుకు అవకాశం ఉంది. ఆమె భర్త క్రిస్టఫర్ గతంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. పద్మావతి యూనివర్సిటీ వీసీ భారతి ప్రస్తుతం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి కోల్‌కాతాకు వెళ్ళారు.అక్కడి నుంచి వచ్చాకే రాజీనామా విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



శ్రీకాంత్ రెడ్డి



రాణీ సదాశివమూర్తి



మధుజ్యోతి

ఎస్వీయూలో నేడు ఏఐఎస్ఎఫ్ సమావేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు తిరుపతిలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరు కానున్నారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు
పీఐసీగా జేసీ బాధ్యతల స్వీకరణ

- 25 విండోలకు అధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 28:చిత్తూరు జిల్లా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), సహకార మార్కెటింగ్ సొసైటీ(సీడీసీఎంఎస్)లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు సహకార సంఘాలకు పీఐసీగా ప్రభుత్వం జేసీని నియమించిన విషయం తెలిసిందే.చిత్తూరు కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీవో నాగవర్ధన్, సీఈవో మనోహర్ గౌడ్, బిజినెస్ మేనేజర్ శ్రీధర్‌నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు వీటికి సెవన్‌మెన్ నాన్ అఫిషియల్ కమిటీలు ఉండగా కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో కమిటీలు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. జేసీ శ్రీనివాసులు ఈ పదవిలో ఆరు నెలల పాటు లేదా పాలకవర్గ ఎన్నికలయ్యేంత వరకు కొనసాగుతారు. కాగా, 25 విండోలకు సంబంధించి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జులుగా డీసీవో నాగవర్ధన, సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించగా వారు బాధ్యతలు స్వీకరించారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీ వరకు పదవిలో కొనసాగుతారు.



పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటున్న జేసీ

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిత్తూరు లీగల్/గుడుపల్లె, జూన్28: బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి చిత్తూరు జిల్లా న్యాయస్థానం 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.గుడుపల్లె మండలానికి చెందిన దేవరాజులు (32) తొమ్మిదో తరగతి చదువుకుంటున్న ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించారు.ఈ కేసు శుక్రవారం పోక్సో కోర్టులో విచారణ జరిగింది.పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం దేవరాజులుపై నేరం రుజువు కావడంతో 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పుచెప్పారు.అలాగే, బాలికకు నష్టపరిహారం కింద రూ.3 లక్షలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

డీవీ సత్రం డిపోలో
ఇసుక భద్రమేనా ...?

అర్ధరాత్రి వేళ తరలించేందుకు ప్రయత్నాలు

దొరవారిసత్రం, జూన్ 28 : గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు చాలామంది ఇసుక వ్యాపారంలో రూ.కోట్లు గడించారు.నదులను తోడి తీసుకొచ్చిన ఇసుకను ప్రభుత్వం డిపోలు ఏర్పాటు చేసి విక్రయించింది. ఆ క్రమంలోనే సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలకు ఇసుక సరఫరా చేసేందుకు దొరవారిసత్రం మండలంలోని నేతాజీనగర్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఇసుక డిపో ఏర్పాటు చేసింది. ఆ డిపో నుంచీ కోట్లాది రూపాయల వ్యాపారం జరిగింది. వాకాడు ప్రాంతాల నుంచి స్వర్ణముఖి ఇసుకను తీసుకు వచ్చి ఇక్కడ డిపోలో నిల్వ చేసి విక్రయాలు చేపట్టారు.ఈ డిపోలో భారీగా ఇసుక నిల్వలున్నాయి. గత ప్రభుత్వంలో విక్రయాలు జరిపిన గుత్తేదారు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక భారీగా డిపోలో ఇసుక నిల్వ చేశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ ఇసుకను రాత్రి వేళల్లో తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఇటీవల ఈ డిపోను పరిశీలించిన జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఆ ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. డిపో వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయించారు. అయితే ఈ కాస్త భద్రతతో ఇసుక నిల్వలను కాపాడడం కష్టమే.అధికార యంత్రాంగం మేలుకోకపోతే ఈ డిపోలోని ఇసుక తమిళనాడు, బెంగుళూరుకు తరలిపోయే అవకాశముంది.



డిపోలోని ఇసుక

పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: తిరుపతి- కాట్పాడి రైల్వేస్టేషన్ల మధ్య రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్లు జూలై 31వ తేదీవరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి తిరుపతి నుంచి కాట్పాడి వరకు రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్ల(07659-07582)ను రద్దు చేశామన్నారు. అలాగే తిరుపతి- విల్లుపురం మధ్య నడిచే రైళ్లు (16853-16854)ను కూడా జూలై 31వ తేదీ వరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

నిమ్మధరలు తగ్గుముఖం



గూడూరు అర్బన్, జూన్ 28: ఇటీవల నిలకడగా కొనసాగిన నిమ్మకాయల ధరలు శుక్రవారం తగ్గుముఖం పట్టాయి. గూడూరు మార్కెట్‌లో శుక్రవారం గరిష్ఠంగా కేజీ రూ. 60 నుంచి కనిష్ఠంగా రూ. 20వరకూ అమ్ముడయ్యాయి. సుమారు 3 నెలలుగా కేజీ రూ. 80కి తగ్గకుండా ధర పలికిన నిమ్మకాయలు శుక్రవారం నిరాశపరిచాయి. దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడం, వేసవితాపం తగ్గిపోవడంతో నిమ్మ ధరలకు తిరోగమనం ప్రారంభమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. తైవాన్ రకం నిమ్మకాయలను వ్యాపారులు అసలు విక్రయానికి తీసుకోలేదని రైతులు వాపోయారు. పండ్లు, పాడికాయలకు 50 కేజీల టిక్కీ బస్తా రూ. 200కు మించి ధర లభించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.



లయన్స్ క్లబ్ తిరుపతి అధ్యక్షుడిగా
ముబారక్ బాషా

తిరుపతి రూరల్, జూన్ 28: తిరుపతి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు భీమినేని మునికృష్ణనాయుడు తెలిపారు. స్థానిక భీమాస్ డీలక్స్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో 2024-25 సంవత్సరానికి కొత్త అధ్యక్షుడిగా ఎస్‌కే ముబాకర్‌బాషా, కార్యదర్శిగా టి.గోకుల్‌కృష్ణ, కోశాధికారిగా మేరీ, ఉపాధ్యక్షులుగా లెక్కల నాగరాజనాయుడు, మిట్టా ప్రదీప్‌కుమార్, వినోద్ వెంకటాచలం, సభ్యుల కమిటీ చైర్మన్‌గా మోహన్ సుందరం, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా రాజేంద్రప్రసాద్, సర్వీస్ చైర్మన్‌గా కేఎస్ ప్రసాద్, మార్కెటింగ్ చైర్మన్‌గా జి.సురేష్, అడ్మినిస్ట్రేటర్‌గా చిత్రా మోహన్, డైరెక్టర్లుగా మబ్బు సూర్యనారాయణరెడ్డి, ఎంఆర్ చంద్రన్, నిర్మల శేఖర్‌బాబు, సులోచన, అన్నం సురేష్‌బాబు, అన్నపూర్ణ, కస్పా పద్మనాభం, సాకం కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ప్రకటించారు. కాగా క్లబ్ మాజీ గవర్నర్ వి.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చేనెల7న నూతన కార్యవర్గ ప్రతినిధుల ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో దంపతులకు మూడేళ్ల జైలు

తిరుపతి(లీగల్), జూన్ 28: చెక్ చీటింగ్ కేసులో తిరుపతికి చెందిన దంపతులు కె.శ్రీనివాసులు, కె.ఓంకారలక్ష్మిలకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి ఎం.సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదు తరపు న్యాయవాది జి.వెంకటకుమార్ తెలిపిన వివరాల మేరకు.. 2011 ఆగస్టు 14వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన పి.పురుషోత్తం వద్ద కె.శ్రీనివాసులు, ఓంకారలక్ష్మి దంపతులు రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే క్రమంలో భార్యపేరుతో ఉన్న చెక్‌పై భర్తసంతకం చేసి పురుషోత్తంకు ఇచ్చారు. సదరు చెక్‌ను బ్యాంకులో డిపాజిట్ చేయగా సంతకం తేడా రావడంతో రిటర్న్ అయింది. ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

హనుమంత వాహనంపై సుందరరాజస్వామి కటాక్షం



తిరుచానూరు, జూన్ 28: తిరుచానూరులో కొలువై ఉన్న సుందర రాజస్వామివారి అవతార మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం కేటీ మండపంలో సుగంధ పరిమళ ద్రవ్యాలతో, భక్తుల గోవిందనామ స్మరణ నడుమ స్వామివారికి అర్చకులు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో ఊంజల్‌సేవ జరిగింది. రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై విహరించారు. శనివారం రాత్రి స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులను దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, శేషగిరి, కేపీ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్



పాకాల, జూన్ 28: పాకాల, దామలచెరువు పంచాయతీల పరిధిలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుక్రవారం శుభ్రం చేశారు. పాకాల, దామలచెరువులో ఎనిమిది చొప్పున ట్యాంకులను క్లోరినేషన్ చేశారు. పంచాయతీ కార్యదర్శి మోతీ మాట్లాడుతూ.. వర్షాకాలంలో విషజ్వరాలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎడిపై విద్యార్థి



అనిరుధ్ శ్రీరామ్ రాజా

తిరుచానూరు, జూన్ 28: తిరుచానూరులోని ఎడిపై పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న అనిరుధ్ శ్రీరామ్ రాజా జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ ప్రణీత్, శ్రీపద్మావతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్ సులోచన తదితరులు అభినందించారు.

అమ్మవారి సేవలో పులివర్తి నాని



తిరుచానూరు, జూన్ 28: పద్మావతి అమ్మవారిని శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట వారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చంద్రబాబు, పవన్ ఫొటోలు



ఫొటోలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, జూన్ 28: చిన్నగొట్టిగల్లు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫొటోలను అమర్చారు. చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కొట్టె శివకుమార్ ఈ ఫొటోలను వితరణగా అందజేశారు. మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయం, ఉపాధి హామీ, వెలుగు, విద్యాశాఖ, ప్రభుత్వ ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రాలు, సబ్-రిజిస్ట్రార్, సచివాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో ఈ ఫొటోలను అమర్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, రెడ్డెప్ప నాయుడు, చోటా సాహెబ్, బావాజాన్, కాకి వెంకటరమణ, హైదర్‌వలీ, రఫీ, సుబ్రహ్మణ్యం, షబాబ్‌బాషా, రాజగోపాల్ నాయుడు, వెంకటేశ్, గుర్రప్ప నాయుడు, నాగరాజ, రామచంద్ర, రామయ్య, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



గదుల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, తదితరులు

భాకరాపేట, జూన్ 28: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో రూపారాణి అన్నారు. భాకరాపేటలో ట్యాంకులు, పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గదుల నిర్మాణాలను ఆమె శుక్రవారం పరిశీలించారు.ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మురుగు గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, కార్యదర్శులు మదనమోహన్ రాజు, రామ్మోహన్, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం



చిన్నగొట్టిగల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

భాకరాపేట, జూన్ 28: బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. చిన్నగొట్టిగల్లులో బాల్య వివాహాలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అంగన్వాడీ కార్యకర్తకు లేదా 1098కు కానీ కాల్ చేయాలన్నారు. డయేరియాపై హెల్త్ సూపర్‌వైజర్ వసంత అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేశారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం



కళావేదికను ప్రారంభిస్తున్న డీఈవో శేఖర్

తిరుచానూరు, జూన్ 28: తిరుచానూరు జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణంలో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి కళావేదికను శుక్రవారం డీఈవో శేఖర్ ప్రారంభించారు. తిరుచానూరులోని పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భారతి తన సొంత నిధులు రూ.3లక్షలు వెచ్చించి విద్యార్థుల సౌకర్యార్థం ఈ కళావేదికను నిర్మించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న భారతి, ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజరుగా పదవీవిరమణ పొందిన టి.హనుమంత్ ప్రసాద్ దంపతులు తమ సొంత నిధులతో కళావేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వాటర్ డిస్పెన్సర్ వితరణ

పాకాల, జూన్ 28: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్‌సీ)కి ఎల్ఐసీ నాగరాజ శెట్టి మనవరాలు కుషిక పుట్టినరోజు పురస్కరించుకుని ఓల్టాస్ వాటర్ డిస్పెన్సర్ వితరణ చేశారు. శుక్రవారం పీహెచ్‌సీలో డాక్టర్ మురళీకృష్ణకు చిన్నారి తల్లిదండ్రులు మానస, గిరీష్ అందజేశారు. అలాగే ఇరంగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. బాలాజీ శెట్టి, ఈవోపీఆర్డీ మాలతి, ఫార్మసిస్ట్ వేణునాయుడు, హెచ్ఎం శ్రీరంజని, సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రగిరిని అభివృద్ధి పథంలో నిలుపుదాం

- ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపు

చంద్రగిరి, జూన్ 28: చేయి చేయి కలుపుదాం.. చంద్రగిరిని అభివృద్ధి పథంలో నిలుపుదామని ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. శుక్రవారం చంద్రగిరి పంచాయతీకి సంబంధించి స్వర్ణముఖి పరివాక ప్రాంతంలోని శ్మశాన వాటికలో గోవిందధామం నిర్మాణం చేపట్టడానికి స్థల పరిశీలన చేశారు. కొత్తపేట ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో ప్రభుత్వానికి ఇచ్చిన రెండు ఎకరాల స్థలంలో చక్కటి గార్డెన్ ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని అధికారులతో చర్చించారు. మూలస్థాన ఎల్లమ్మ కొండచుట్టు తిరునాళ్లలో తోట ఉత్సవం నిర్వహించే పురాతన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలోని కోనేరును పరిశీలించి, ఆధునికీకరించాలని చెప్పారు. నాని మాట్లాడుతూ.. చంద్రగిరి అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకారం అందిస్తారని వివరించారు. కాగా, గతవారం చెప్పినట్లుగా చంద్రగిరి-శ్రీనివాస మంగాపురం మధ్యలో ఉన్న రహదారికి మరమ్మతులు పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు విశ్రాంతి భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నరసింగాపురం, మిట్టపాలెం మధ్యలో ఉన్న హథీరాంజీ మఠం భూములను మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణలుంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సర్వీసు లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని ఆశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.



స్వర్ణముఖినది ఒడ్డున గోవిందధామం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న నాని తదితరులు

ఎమ్మెల్యే పేరుతో వసూలు చేస్తే చర్యలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పేరుతో వసూలు చేస్తే చర్యలు తప్పవని నాని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ మోహన్‌బాబు, సిబ్బంది, దస్తావేజుల లేఖర్లతో మాట్లాడుతూ ఇప్పుడు కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి అనే భ్రమలో మీరు ఉన్నట్లు అనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుచేసిన వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట సూర్యసాయి, హథీరాంజీ మఠం అధికారి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు సురేష్‌రెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్, అత్తూరు తులసేశ్వరరెడ్డి, లోకాద్రి నాయుడు, ఎల్లప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుడా స్థలానికి స్టేటస్‌కో



తిరుమలనగర్ పంచాయతీలో స్టేటస్‌కో ఇచ్చిన తుడా స్థలం

మంగళం, జూన్ 28: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు సర్వే నెంబరు 176/2లో 1.21 ఎకరాల భూమి ఉంది. ఎప్పటి నుంచో ఈ స్థలంలో తుడా అధికారులు చింతచెట్లను పెంచుతున్నారు. ఈ సర్వే నెంబరులో 40 సెంట్ల భూమిని ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన తుడ అధికారులు బి.సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తికి ఐదేళ్లపాటు లీజుకు ఇచ్చారు. నెలకు లీజు రూ.46వేలను తుడాకు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే చెన్నాయిగుంట, రామచంద్రానగర్ గ్రామస్తులు తాము ఎప్పటి నుంచో గ్రామదేవతగా పూజలు చేసుకుంటున్న ఆలయం రోడ్డు విస్తరణలో పోయే ప్రమాదం ఉందని.. పక్కనే ఉన్న తుడాకు చెందిన స్థలంలో ఆలయాన్ని పునర్నిర్మించుకోవడానికి అనుమతుల కోసం అప్పటి చైర్మన్‌గా ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే ఆలయ నిర్మాణ పనులు మొదలు పెట్టడంతో తుడా అధికారులు అడ్డుకున్నారు. తర్వాత ఏమి జరిగిందోకానీ గ్రామస్తుల ఆకాంక్ష మేరకు ఆలయ పునర్నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించారు. ఈ క్రమంలో తుడాకు చెందిన స్థలం తమదంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. అయ్యాస్వామి కుమారుడు సురేష్ అనే వ్యక్తి చెన్నాయిగుంట గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తిరుపతి అర్బన్ మండల రెవెన్యూ అధికారులు, తుడా వీసీ, తుడా అధికారులను పార్టీలుగా చేరుస్తూ ఈ పిల్ దాఖలు చేశారు. దీంతో తుడాకు చెందిన స్థలానికి ఈ ఏడాది మే రెండో తేదీన హైకోర్టు.. స్టేటస్‌కో ఇచ్చింది.

తుడా భూములను స్వాధీనం చేసుకుంటాం



స్టేటస్‌కో త్వరలోనే రద్దవుతుంది. ఆ వెంటనే తుడా ఆక్రమిత స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుంటాం. అలాగే చెన్నాయిగుంట, రామచంద్రానగర్ గ్రామస్తుల వద్ద ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా తుడాకు చెందిన 11 సెంట్ల భూమిని ఆక్రమించి ఆలయ నిర్మాణం చేస్తున్నారు. సదరు భూమినీ స్వాధీనం చేసుకుంటాం.

- వెంకటరమణ, తుడా ఇన్‌చార్జి వీసీ

చంద్రబాబుకు వలపల శుభాకాంక్షలు



పాకాల, జూన్ 28: ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతి క్యాంప్ ఆఫీసులో చంద్రగిరి నియోజక వర్గ సీనియర్ టీడీపీ నాయకుడు వలపల దశరథనాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాల్గవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ యువనేతకు చెవిరెడ్డి పరామర్శ

పాకాల, జూన్ 28: పాకాల మండల వైసీపీ యువజన విభాగ అధ్యక్షుడు ఎం.యుగంధర్ ప్రసాద్ (చంటి)ని శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పరామర్శించారు. గురువారం గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన ఆయనకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

ఎర్రావారిపాలెం, జూన్ 28: మామిడికాయల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నెరబైలు పంచాయతీ నుంచి మామిడికాయ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బూడిదేటివారిపల్లె సమీపంలో శుక్రవారం బోల్తా పడింది. ఈ ఘటనలో రఘు అనే వ్యక్తి మృతి చెందాడు. ఇతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా పోలీసులకు గుర్తించారు. సంఘటనా స్థలానికి భాకరాపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్ వలి చేరుకుని, గాయపడిన వారిని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పీటీసీ ప్రిన్సిపాల్‌కు సత్కారం



రాధాకృష్ణ దంపతులను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

చంద్రగిరి, జూన్ 28: ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ (పీటీసీ) కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శుక్రవారం పదవీ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా పీటీసీలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రిన్సిపాల్ రాధాకృష్ణ దంపతులను సన్మానించారు. కళాశాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



చంద్రప్రకాష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: శ్రీకాళహస్తి మండలం పాపనపల్లెకు చెందిన సి.చంద్రప్రకాష్ ఎస్వీయూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆ వర్సిటీ జువాలజీ విభాగంలో 'కమ్యూలేటివ్ బెనిఫిషియల్ ఎఫెక్ట్ ఆఫ్ బోత్ అలోవేర అండ్ మ్యాంగో పల్ప్ ఆన్ కార్డియాక్ అండ్ రీనల్ బయోకెమికల్ అండ్ ఆక్సిడేటివ్ స్ట్రెస్ ఎంజైమ్స్ ఇన్ స్ట్రెప్టోజోటోసిన్ ఇండ్యూస్డ్ డయాబెటిక్ ర్యాట్స్' అంశంపై ప్రొఫెసర్ ఎం.భాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ తెలిపారు.



కుంట్రపాకం పంచాయతీ గ్రామదేవత పిడసాల గంగమ్మ జాతర సందర్భంగా సారె సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి. ఈ కార్యక్రమంలో రామ్మూర్తిరెడ్డి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

రెస్కోలో అక్రమ నియామకాలు వాస్తవం

- అడ్డగోలు పదోన్నతులు కూడా
- అధిక ధరలకు మెటీరియల్ కొనుగోలు
- జేసీ శ్రీనివాసులు నిర్ధారణ
- పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతల స్వీకరణ
- ఆడిట్ విచారణకు త్వరలోనే ప్రత్యేకాధికారి నియామకం

కుప్పం, జూన్ 28: కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లో అక్రమాలు, అవతకతవకలు జరిగిన మాట వాస్తవమేనని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు నిర్ధారించారు. రెస్కో పర్సన్ ఇన్‌ఛార్జిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన, సంస్థలో అక్రమ నియామకాలు, అడ్డగోలు పదోన్నతులతోపాటు అధిక ధరలకు మెటీరియల్ కొనుగోళ్లు కూడా జరిగాయని తమ ప్రాథమిక పరిశీలనలో తేలిందని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన రెస్కో అధికారులు, రెగ్యులర్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఇతర సిబ్బందితో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రెస్కో పూర్తిగా అవినీతి, అక్రమాల మయమైపోయిందన్నారు. అక్రమ నియామకాలు, ఇతర అవినీతి చర్యలపై తమకు అందిన ఫిర్యాదుల మేరకు ప్రాథమిక విచారణ పూర్తి చేశామని చెప్పారు. గతంలో ఈ సంస్థలో 127 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహించేవారని గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో ఆ సంఖ్య ఏకంగా 227కు పెరిగిపోయిందన్నారు. సుమారు 120 మంది నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు పొందారని ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. వీరి నియామకాలలో అధికారులు నిబంధనలు పాటించలేదన్నారు. ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టడంతో వారి వేతనాలు సంస్థకు భారంగా తయారయ్యాయని, ఇక్కడున్న పనికి మించి ఉద్యోగులు చేరిపోయారని వివరించారు. రెస్కోలో ఇలా నిబంధనలు అధిగమించి ఉద్యోగాలు పొందిన వారు ఎంతమంది అనేది విచారణలో తేలుస్తామన్నారు. ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలోనూ ఎటువంటి ప్రమాణాలు, నిబంధనలు, సీనియారిటీ పాటించలేదని స్పష్టంచేశారు. వేతనాలు కూడా పరిమితికి మించి పొందుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక మెటీరియల్‌నూ అధిక ధరలు చెల్లించి కొనుగోళ్లు చేయడంలో అవినీతి చోటుచేసుకుందని చెప్పారు. ఇక, రెస్కో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. వివిధ ప్రభుత్వ సంస్థలనుంచి రూ.100 కోట్లు, ఇతరత్రా మరో 48 కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఖర్చులు, కొనుగోళ్ల వేతనాల లెక్కలు తేల్చి ఆడిట్ చేయడానికి త్వరలోనే ఒక ఒక విచారణాధికారిని నియమిస్తామని చెప్పారు. అన్ని లెక్కలు, నియామకాల గురించి తేలిన తర్వాత ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తామని జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఆ తర్వాత మాత్రమే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెస్కో ఎండీ ప్రభాకర్, ఏడీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



రెస్కో పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్నాక ఉద్యోగులతో సమావేశమైన జేసీ శ్రీనివాసులు

రెస్కోలో ఏఆర్ విచారణ : కుప్పం రెస్కోలో సహకార సంస్థ)లో వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలపై కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్రమ నియామకాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఆరు నెలల కిందట రెస్కోలో దాదాపు 150 మంది సిబ్బందిని అడ్డగోలుగా నియమించుకున్నట్లు తీవ్ర ఆరోపణలున్నాయి. అలా నియమితులైన ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అప్పట్లో ఉంటాయో ఊడతాయో తెలియని ఈ ఉద్యోగాలకు అటు పాలకులకు, ఇటు అధికారులకు కూడా లక్షల్లో ముడుపులు ముట్టాయన్న ఆరోపణలూ ఉండనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ అక్రమ నియామకాలకు సంబంధించిన కొన్ని కీలకమైన ఫైళ్లను తన వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది.

పూర్తి అంగవైకల్యమున్నా పింఛను తీసేశారు

- పొలం ఉందంటూ తొలగింపు
- 34 ఏళ్లు వచ్చినా తల్లి లాలనలోనే
- వైద్యం ఖర్చులు అందించాలని ప్రభుత్వానికి గ్రామస్థుల వేడుకోలు

ఐరాల, జూన్ 28: శరీరంలో ఏ అవయవమూ పనిచేయదు. 34 ఏళ్లు వచ్చినా చంటిబిడ్డలా చూసుకుంటోందా తల్లి. ఇతడి ఆలనా పాలనకు రోజూ ఇద్దరు మనుషులు కావాలి. ఇక, ఆస్పత్రిలో వైద్యం ఖర్చు ఏటా రూ.లక్షల్లోనే. అలాంటి ఇతడికి వైసీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా పింఛను తీసేసింది. ఇతడి తల్లిదండ్రుల పేరిట 18 ఎకరాల పొలం ఉందని తొలగించేసింది. పొలమున్నా సేద్యం చేయక.. డబ్బు రాక ఇబ్బంది పడుతున్నామని చెప్పినా పట్టించుకోలేదు. వివరాలిలా ఉన్నాయి. ఐరాల మండలం నాంపల్లె రెవెన్యూ మిరియంగంగనపల్లెకు చెందిన సోమశేఖర్‌నాయుడు, సరస్వతమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమారుడు తులసీరామ్ పుట్టుకతోనే పూర్తి స్థాయి అంగ వైకల్యంతో జన్మించాడు. కొంత కాలానికి తండ్రి మృతి చెందాడు. అప్పట్నుంచి తల్లే అతడికి అన్నీ అయ్యి చూసుకుంటోంది. అతడి ఆలనా పాలనకు ఇద్దరు మనుషుల అవసరం ఉంటుంది. అతడికి ద్రవరూపంలో పైపు ద్వారా భోజనం అందిస్తారు. ఆ యువకుడిని అంగ వైకల్యంతో పాటు ఊపిరితిత్తుల సమస్య వెంటాడుతోంది. ఈ క్రమంలో అతడిని ఆస్పత్రిలో చూపించడానికి వెళ్లిన ప్రతి సారి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చయేది. అలా ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇక, ప్రతి నెలా మందుల ఖర్చుగా రూ.15,000 వరకు ఖర్చవుతోంది. టీడీపీ హయాంలో ఈ యువకుడికి పూర్తి అంగవైకల్యం కింద పింఛను ఇచ్చేవారు. ఈ పింఛను డబ్బు మందుల ఖర్చుకు కొంతవరకు ఉపశమనంగా ఉండేది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. 2022 సెప్టెంబరులో నెలలో పింఛను తొలగించింది. ఇతడి తల్లిదండ్రుల పేరిట 18 ఎకరాల పొలం ఉండటాన్ని చూపారు. అయితే, కుటుంబ యజమాని లేకపోవడం, ఆ పొలాన్ని సొంతంగా సాగు చేయలేక ఆర్థికంగానూ ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో పింఛను కొనసాగిస్తే వైద్య ఖర్చులకు కొంతవరకు బాసటగా ఉంటుందని కోరినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా, కొంతకాలం కిందట అతడిని ఆస్పత్రికి తీసుకు రావాల్సిన అవసరం లేదని డాక్టర్లు చెప్పడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. అయినా, ఎంతో సహనంతో అతడిని చూసుకుంటోంది. ప్రస్తుతానికి ఊపిరితిత్తుల సమస్య కొంతవరకు తగ్గి ఆ యువకుడు కొంచెం కుదురుగా ఉన్నాడు. తులసీరామ్ పరిస్థితిని చూసి ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వమైనా అతడి మందుల ఖర్చులకు అవసరమైన డబ్బును పింఛను రూపంలో అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ద్రవ రూపంలో ఫీడింగ్ తీసుకుంటున్న తులసీరామ్

రొంపిచెర్లలో 8 మంది వార్డు మెంబర్ల రాజీనామా

రొంపిచెర్ల, జూన్ 28: పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలానికి చెందిన 8 మంది వార్డు మెంబర్లు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారికి రాజీనామా పత్రాలు అందజేశారు. ఇప్పటికే పుంగనూరు మున్సిపల్ చైర్మన్, మరో పది మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే మరికొందరు కౌన్సిలర్లతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో రొంపిచెర్ల పంచాయతీకి చెందిన 3, 6, 8 వార్డు మెంబర్లు ఎస్.మస్తాన్, సి.లక్ష్మయ్య, ఎన్.నజీముద్దీన్.. బోడిపాటివారిపల్లె పంచాయతీలో 2, 4, 6 వార్డు మెంబర్లు డి.సరేష్, ఎం.దీప, ఎస్.రెడ్డెమ్మ.. జగడంవారిపల్లె పంచాయతీ మూడో వార్డు మెంబరు ఎస్.బాలాజీ, పెద్దమల్లెల పంచాయతీ మూడవ వార్డు సభ్యుడు ఎస్.ప్రభు కుమార్ శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశామని తెలియజేశారు. ఈ రాజీనామాల వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



సదస్సులో ప్రసంగిస్తున్న తిలక్‌రాజ్ శర్మ

ముగిసిన చిరుధాన్యాల పరిశోధన సదస్సు

తిరుపతిరూరల్, జూన్ 28: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సు శుక్రవారంతో ముగిసింది. దీనిలో భాగంగా చిరుధాన్య పంటల ఉత్పాదకత పెంపు, ఆహార, పోషక భద్రత సాధించే దిశగా గత ఏడాదిలో చిరుధాన్య పంటల్లో చేపట్టిన పరిశోధనా ఫలితాలని విశ్లేషించి.. ఈసంవత్సరం చేపట్టాల్సిన కార్యాచరణపై విపులంగా చర్చించారు. అలాగే చిరుధాన్య పంట రకాల ఎంపిక కోసం ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ ఆధ్వర్యంలో వీఐసీ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ వాతావరణ వ్యవసాయ మండలాల్లో చీడపీడలని తట్టుకుని అధిక దిగుబడితోపాటు అధిక పోషక విలువలు కలిగిన రకాలు, వంగడాలను సాగుకు సిఫారసు చేసినట్లు ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి వివరించారు. రూట్ అండ్ రైజోస్ఫేర్ ఇంజనీరింగ్ ఫర్ డెవలప్పింగ్ క్లైమేట్ రీసిలియెంట్ క్రాప్స్‌పై తిరుపతి ఐసర్ అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరరామిరెడ్డి ఉపన్యసించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీ వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని గోకుళం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి తిరుమలలోని పెద్ద, జనతా హోటళ్లపై సమీక్షించారు. సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖమైన హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడు చలేశ్వరరావు, తాజ్ హోటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించినట్టు తెలిపారు. దీనికి ముందు తిరుమల ఎస్టేట్స్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలోని హోటళ్ల గురించి వివరించారు. అలాగే ఐటీ విభాగం భక్తులకు అందిస్తున్న వివిధ సేవల గురించి జియో బృందంతో ఈవో సమీక్షించారు. అనంతరం ఆలయ సిబ్బంది, పోటు కార్మికులతో సేంద్రియ ప్రసాదాలపై సమావేశం నిర్వహించారు. డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఐజీ మేనేజర్ నాదముని, జియో సంస్థ ప్రతినిధులు మోహిన్ అబ్బాస్, విజయ్‌కుమార్, మంజీత్, పోటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనంలో తనిఖీలు

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలను స్వయంగా పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. స్వయంగా కొన్ని అన్నప్రసాదాల రుచిని పరిశీలించారు. భక్తుల సూచన మేరకు అన్నప్రసాదాలను మరింత రుచిగా అందించాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు.



జేఈవోతో మాట్లాడుతున్న శ్యామలరావు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,100 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, తెలంగాణ ఎమ్మెల్సీ సుంకరి రాజు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేసి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



యార్లగడ్డ వెంకట్రావు

నేడు టౌన్‌బ్యాంక్ మహాజన సభ

తిరుపతి(ఆటోనగర్), జూన్ 28: తిరుపతి టౌన్ బ్యాంక్ మహాజన సభ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు బ్యాంక్ ఆవరణలో జరగనుంది. చైర్మన్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఈ సభ జరుగుతుందని మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివకుమార్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది మార్చిలో జరగాల్సిన సభను ఎన్నికల నియమావళి కారణంగా ఇపుడు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ వాటాదారులు (ఏ క్లాస్ సభ్యులు) హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమానా

తిరుపతి(లీగల్), జూన్ 28: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే రోడ్డుపై పాదచారులను ఇబ్బందులకు గురిచేసిన 44మంది వ్యాపారులకు రూ.200 చొప్పున జరిమానా విధించారని తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ తెలిపారు.



తిరుమల స్థానికుల మేలు మరువను : ఆరణి

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌లోని సమస్యలను మూడు దఫాల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శ్రీవారికి తలనీలాలు సమర్పించి శుక్రవారం ఉదయం దర్శనం చేసుకున్న ఆరణి ఉదయం 10 గంటలకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌కు వెళ్లి స్థానికులతో సమావేశమయ్యారు. టీటీడీ, రెవెన్యూ, ఇంజనీరింగ్, ఫారెస్ట్ అధికారులతో కలిసి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొదటిదశలో పెండింగ్‌లో ఉన్న 604 ఇళ్లకు నీటి కొళాయిలు 90 రోజుల్లోపే ఏర్పాటు చేస్తామన్నారు. డ్రైనేజీ, కల్వర్టులు, కాలువలను రెండో దశలో ఏర్పాటు చేస్తామన్నారు. గత ఎమ్మెల్యే చిరంజీవి ప్రారంభించి పూర్తికాని ఇళ్ల స్లాబ్ పనులు మూడో ఫేజ్ కింద పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి స్థానం నుంచి తాను భారీ మెజార్టీతో గెలవడానికి తిరుమల స్థానికుల మద్దతు, మేలును తాను మరువలేనన్నారు. క్రూరమృగాల సంచారంతో ఇబ్బంది లేకుండా బాలాజీనగర్ చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు ప్రతిపాదనకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికుల సమస్యలను చంద్రబాబు, పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి టీటీడీ నిధులను వినియోగించుకునే విషయంపై చర్చిస్తామన్నారు. ఫుడ్ కోర్టుతోపాటు ఆస్పత్రి ఏర్పాటుపైనా దృష్టి సారిస్తామన్నారు. ఇక, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు టీటీడీకి నూతన బోర్డు వచ్చిన తర్వాత స్థానికులకు ప్రతి మంగళవారం దర్శనం కల్పిస్తామన్నారు. శ్రీవాణి ట్రస్టు, బ్రేక్ దర్శన టికెట్ల కేటాయింపులో చట్టం తన పనితాను చేస్తోందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఐదేళ్లలో తిరుమల, తిరుపతిలో భారీగా అక్రమాలు, అవినీతి జరిగాయని, పరిశీలించి ప్రక్షాళన చేస్తామన్నారు. ధర్మకర్తల మండలి ఏర్పాటైన తర్వాత చిరు వ్యాపారులు, దుకాణదారుల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఎమ్మెల్యేను కలిసిన ఏపీ హంస నేతలు



తిరుపతి(వైద్యం), జూన్ 28: వైద్య ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, తిరుపతి తాలుకా ఏపీ హంస(ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) నేతలు తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా కార్యదర్శి టాటాబాయి, ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, నేతలు సురేంద్ర, అరుణమ్మ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌కు సత్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను టీడీపీ నాయకుడు పాకనాటి హరికృష్ణ యాదవ్ సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా విజయవాడలో శుక్రవారం ఆయన్ను కలిసి, శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఓబీసీ ఫోరం నేత నున్న భూషణ్, అలవీరు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్టు మృతి కేసులో ఆటోడ్రైవర్‌కు జైలుశిక్ష

తిరుపతి(లీగల్), జూన్ 28: ఓ స్కూటరిస్టు మృతికి కారణమైన మంగళంకు చెందిన ఆటో డ్రైవర్ సి.మురళీకి మూడు నెలల 15 రోజుల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. 2022 జనవరి 4వ తేదీన మంగళం హరితకాలనీకి చెందిన పి.స్వామినాధన్ స్కూటర్‌పై వెళ్తుండగా వెనుకనుంచి ఆటోతో డ్రైవర్ మురళి ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆపై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అలిపిరి పోలీసులు కేసు నమోదుచేశారు. కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

నేడు, రేపు మహతిలో ఏకపాత్రాభినయాలు

తిరుపతి (జీవకోన), జూన్ 28: మహతి ఆడిటోరియంలో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు ఏకపాత్రాభినయాలు, పార్వతీ కల్యాణం పద్య నాటకాలు ప్రదర్శిస్తామని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ స్థాపకుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, గుండాల గోపీనాథ్, టీటీడీ విశ్రాంత డీఈవో చిన్నంగారి రమణ, జేఈవో వీరబ్రహ్మం, బై అండ్ సేవ్ మధు, గోల్కొండ వెంకటేష్ హాజరు కానున్నట్లు తెలిపారు. శాంభోలు హరినాథ్, చంద్రబాబునాయుడు, గోపాల్‌రావు, మునిసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సుబ్బరాజు

వ్యవసాయ కాలేజీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

తిరుపతిరూరల్, జూన్ 28: ఎస్వీ వ్యవసాయ కళాశాలలో సాంఖ్యకశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో శ్రీపద్మావతి వేంకటేశ్వర ఫౌండేషన్, ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ ఆర్థిక సౌజన్యంతో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ని శుక్రవారం వీసీ శారద జయలక్ష్మీదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించేందుకు ల్యాబ్‌ని ఏర్పాటు చేశామని చెప్పారు. సాంఖ్యకశాస్త్ర విభాగ హెడ్ డాక్టర్ మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ఆధునిక గణాంక విధానాల ఆవశ్యకతని గుర్తించి ప్రయోగశాలను ఏర్పాటు చేశామని వివరించారు. డీఆర్ పీవీ సత్యనారాయణ, వ్యవసాయ కళాశాల ఏడీ ఎంవీ రమణ, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ వి.సుమతి, పరిశోధనా ప్రాజెక్టుల ప్రత్యేక అధికారి పి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ని ప్రారంభిస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి, తదితరులు

ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు

తిరుపతిరూరల్, జూన్ 28: పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్(కాబి) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విస్తరణ అధికారులకు సాగులో డిజిటల్ యాప్‌లు, ఆన్‌లైన్ కోర్సులపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాబి యాప్స్, కోర్సులు చాలా ఉపయుక్తంగా ఉంటాయని, ఈ శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరికి శిక్షణను దక్షిణ ఆసియా కోఆర్డినేటర్ మధు మంజరి ఇచ్చారు. వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య, డివిజన్ వ్యవసాయ అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏవోలు శశికళ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో కర్ణాటక భక్తుడి అదృశ్యం

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ కర్ణాటక భక్తుడు కనిపించకుండా పోయాడు. కర్ణాటకలోని చిత్రదుర్గ తాలూక తిమ్మప్పనహళ్లికి చెందిన డి.అంజినప్ప (64) శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 17వ తేదీ తిరుమలకు వచ్చారు. రాత్రి వరాహస్వామి విశ్రాంతి భవనం ముందున్న కారు పార్కింగ్‌లో అందరూ నిద్రించారు. వేకువజామున 4 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా అంజినప్ప కనిపించలేదు. వారు తిరుమలలోని అన్ని ప్రదేశాల్లో గాలించారు. సొంతూరులోనూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన కుమారుడు నాగరాజు శుక్రవారం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు తెలిసినవారు 94400 81641 నెంబరు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



అంజినప్ప (ఫైల్ ఫోటో)

టైం స్కేల్ వర్తింపజేయండి

మంత్రి నారా లోకేశ్‌కి ఎన్ఎంఆర్‌ల వినతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: ఎస్వీ యూనివర్సిటీలో పనిచేస్తున్న తమకు టైంస్కేల్ వర్తింప చేయాలని మంత్రి నారా లోకేశ్‌ను ఎన్ఎంఆర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఎన్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రబాబు, సిద్ధయ్యయాదవ్ తదితరులు విజయవాడలో మంత్రిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. టైం స్కేల్‌తో పాటు పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని విన్నవించారు.



లోకేశ్‌కి వినతిపత్రమిచ్చిన జయచంద్రబాబు



ఢిల్లీలో పార్లమెంటు స్పీకర్ ఓం బిర్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్ పీసీ రాయలు

హోమియో వైద్యశాలలో తనిఖీలు

మంగళం, జూన్ 28: మంగళం పరిధిలోని ప్రభుత్వ హోమియో వైద్యశాలను ఆయుష్ విభాగం రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.శేఖర్ రాజు శుక్రవారం తనిఖీ చేశారు. హోమియో వైద్యాధికారి ప్రసన్న లక్ష్మిని ఓపీ రిజిస్టర్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా కమిషనర్ రాజేంద్రప్రసాద్ సహకారంతో రూ.3.5లక్షలతో వైద్యశాలను ఆధునికీకరించి.. రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. హోమియో వైద్యశాల సిబ్బంది తారకనాథ్, లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.



వైద్యశాలలో తనిఖీలు చేస్తున్న శేఖర్‌రాజు

రైల్వేస్టేషన్లలో టీటీఐల తనిఖీలు



రేణిగుంట రైల్వేకోర్టులో లైసెన్స్ లేని హాకర్లను హాజరు పరిచిన అధికారులు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో శుక్రవారం పలు రైల్వేస్టేషన్లలో టీటీఐలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వేకు అపరాధ రుసుం రూపంలో రూ.3.03 లక్షలు వసూలు చేసినట్లు డివిజన్ కమర్షియల్ మేనేజరు సోమశేఖర్ నాయుడు తెలిపారు. అలాగే ఎనిమిది మంది హాకర్లను రేణిగుంట రైల్వేకోర్టుకు హాజరు పరిచామన్నారు. రైల్వే స్టేషన్లలో మెడికల్ కార్డులు లేని అనధికార హాకర్లు వస్తు విక్రయాలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రేణిగుంట- కడప- గూడూరు- కాట్పాడి మార్గాల్లో ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. 605 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఏసీఎం ధనంజయకుమార్ సింగ్, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.రావు, కె.సుధాకర్‌లతోపాటు 36 మంది స్క్వాడ్ టీటీఐలు పాల్గొన్నారు.

మఠాలపేరుతో వ్యాపారం చేస్తున్నవారిని అరెస్ట్ చేయాలి

జనసేన నాయకుడు కిరణ్‌రాయల్

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మఠాల పేరుతో వ్యాపారం చేస్తున్న వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. శారదమఠంలోని అక్రమ కట్టడాలను పరిశీలించేందుకు వచ్చిన ఏపీ సాధు పరిషత్ స్వామిజీలకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం మఠం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలలో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయన్నారు. తాము తిరుమలలో అన్ని మఠాలను సందర్శించామన్నారు. దాదాపు 60 శాతం మఠాలన్నీ కలిసి వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. ఒకరిద్దరి చేతుల్లో మఠాలను పెట్టి లక్షలు దోచేస్తున్నారన్నారు. గత ఎమ్మెల్యే, గత ఈవో, పోలీసు అధికారులు వాటాలు కొట్టేశారన్నారు. ఈ అవినీతి అక్రమాలన్నీ త్వరలో ప్రజల ముందు పెడతామన్నారు. మఠాల అంశంపై ఇప్పటికే నూతన ఈవోకు విన్నతిపత్రాన్ని అందజేశామని, ఆదివారం ఆయనతో సమావేశమై అన్ని విషయాలు తెలియజేస్తామన్నారు. శారదమఠంలో కట్టడాలను కూల్చితేనే మఠాల్లో అక్రమ కట్టడాలకు చెక్ పడుతుందని అభిప్రాయపడ్డారు. మఠాల అంశంపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకోవాలన్నారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు చెప్పారు. న్యాయపరంగా అనుమతులు ఉన్న వాటిని వదిలి.. అక్రమకట్టడాలన్నీ తొలగించాలని డిమాండ్ చేశారు.





జామియా మసీదు కమిటీ నియామకం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న పాశిం సునీల్‌కుమార్

కోట, జూన్ 28 : కోటలోని బజారుసెంటర్‌లో ఉన్న జామియా మసీదు నూతన కమిటీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు నూతన పాలకమండలిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ శాలువాలతో అభినందించారు. జామియా మసీదు ముత్తవల్లి ధర్మకర్తగా షేక్‌ఆలీ అహ్మద్, సెక్రటరీగా జహీర్‌బాషా, కోశాధికారిగా మాబాషా బాధ్యతలు చేపట్టారు. సభ్యులుగా కరీముల్లా, జాహీద్‌నవాజ్, ఖాదర్‌మోహి ద్దీన్, నౌషాద్, సునీల్‌బాషా, అహ్మద్‌బాషా, అబ్దుల్, వహీద్ నియమితులయ్యారు.

సామూహిక పుట్టినరోజు వేడుకలు



గూడూరు, జూన్ 28: స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకుల పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో విద్యార్థినులకు సామూహిక పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతినెలా ఆ నెలలో పుట్టినరోజు జరుపుకోనున్న విద్యార్థినులకు సామూహిక పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత



గూడూరు, జూన్28: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతిలో ప్రతిభచాటిన విద్యార్థులకు 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన హర్షవర్ధన్, గెర్షోమ్, యావేష్ అనే విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, శివకుమార్, వరప్రసాద్, దామోదర్, కొండా శ్రీనివాసులు, గిరి, రాజేష్, డేగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



సూళ్లూరుపేట, జూన్ 28: సూళ్లూరుపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఆరవపాణి ప్రమీలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో శ్రీనివాసుల రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉపాధ్యాయులుగా ఉంటూ ప్రమీల సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శీనయ్య, ప్రధానోపాధ్యాయుడు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించండి



ఆందోళన చేస్తున్న రైతులు

పెళ్లకూరు, జూన్ 28: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలంటూ శుక్రవారం బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పెన్నేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 10లో 10 మంది రైతులకుపైగా 20 అంకణాల నుంచి 30 అంకణాల వరకు భూములు కోల్పోయారు. అయితే భూములు కోల్పోయిన రైతులు ప్రతాప్‌రెడ్డి, జయరామయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం తదితర రైతుల ఖాతాలలో నగదు జమచేయలేదు. రోడ్డు విస్తరణ పనులు మాత్రం బాధిత రైతుల భూముల్లో చేపడుతున్నారు. నగదు అందజేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

చేయూత ఆశ్రమానికి నిత్యావసరాల అందజేత



భోజనం చేస్తున్న ఆశ్రమ విద్యార్థులు

నాయుడుపేట,జూన్ 28: నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని చేయూత అనాథ ఆశ్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త బయ్యా రమేష్ బియ్యం, నిత్యావసర సరుకులు, కాస్మోటిక్స్ అందజేశారు. రమేష్ భార్య సుజాత జన్మదినం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఏర్పాటు చేశారు. ఆశ్రమంలోని విద్యార్థులను బాధ్యతగా, అభిమానంగా చూసుకుంటున్న ఆశ్రమ నిర్వాహకుడు తొప్పాని కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

చంద్రబాబుతో మాధవ నాయుడి భేటీ



దక్కిలి, జూన్ 28 : విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాదవ నాయుడు కలిశారు. నాలుగో సారి ముఖ్యమంత్రి అయిన సందర్భంగా ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. చంద్రబాబుకు చిన్ననాటి స్నేహితుడైన మాధవనాయుడు యోగక్షేమాలు, అండమాన్ నికోబార్ దీవుల్లో పార్టీ స్థితిగతులను చంద్రబాబు తెలుసుకొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అండమాన్ ఎంపీ స్థానం టీడీపీ మద్దతుతో గెలుసుకోవడం జరిగిందన్నారు. అనంతరం వారిద్దరు బాల్యజ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు.

హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్



సూళ్లూరుపేట, జూన్ 28: సూళ్లూరుపేటలోని పలు హోటళ్లను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మద్దిలేటి ఆకస్మికంగా తనిఖీ చేశారు హోటళ్ల నిర్వహించే వ్యాపారస్తులు ఆహార నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలు వినియోగించి ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

గూడూరు అర్బన్, జూన్28: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల రాయితీలతోపాటు వసతి గృహ సౌకర్యం, క్రీడా మైదానం ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9866008662, 9553558613 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రేపు విజయపురం మండల సమావేశం

విజయపురం, జూన్ 28: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ జమున అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యే ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మహారాజపురంలో ఎమ్మెల్యే పర్యటన

విజయపురం మండలంలోని మహారాజపురంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం పర్యటించారు. ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దళితవాడలో శరత్ గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి చినబాబు, మండలాధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, పురుషోత్తం, వెంకటేష్ యాదవ్, లోకేష్‌రాజు, డీఎస్‌రాజు, కాటయ్య పాల్గొన్నారు.

నేడు, రేపు మహతిలో ఏకపాత్రాభినయాలు

తిరుపతి (జీవకోన), జూన్ 28: మహతి ఆడిటోరియంలో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు ఏకపాత్రాభినయాలు, పార్వతీ కల్యాణం పద్య నాటకాలు ప్రదర్శిస్తామని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ స్థాపకుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, గుండాల గోపీనాథ్, టీటీడీ విశ్రాంత డీఈవో చిన్నంగారి రమణ, జేఈవో వీరబ్రహ్మం, బై అండ్ సేవ్ మధు, గోల్కొండ వెంకటేష్ హాజరు కానున్నట్లు తెలిపారు. శాంబోలు హరినాథ్, చంద్రబాబునాయుడు, గోపాల్‌రావు, మునిసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కర్ణాటక భక్తుడి అదృశ్యం



అంజినప్ప (ఫైల్ ఫొటో)

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ కర్ణాటక భక్తుడు కనిపించకుండా పోయాడు. కర్ణాటకలోని చిత్రదుర్గ తాలూక తిమ్మప్పనహళ్లికి చెందిన డి.అంజినప్ప (64) శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 17వ తేదీ తిరుమలకు వచ్చారు. రాత్రి వరాహస్వామి విశ్రాంతి భవనం ముందున్న కారు పార్కింగ్‌లో అందరూ నిద్రించారు. వేకువజామున 4 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా అంజినప్ప కనిపించలేదు. వారు తిరుమలలోని అన్ని ప్రదేశాల్లో గాలించారు. సొంతూరులోనూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన కుమారుడు నాగరాజు శుక్రవారం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు తెలిసినవారు 94400 81641 నెంబరు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోట, జూన్ 28 : చిట్టేడు ప్రభుత్వ బాలికల ఐటీఐలో రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అద్దంకి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ 9 సీట్లు, ఫిట్టర్ 10 సీట్లు, ఎలక్ట్రానిక్ మెకానిక్ 14 సీట్లు, మెకానికల్ డీజిల్ 42 సీట్లు, వెల్డర్ 40 సీట్లు వంతున ఖాళీలు ఉన్నాయన్నారు. జూలై 24వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు సమీప ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఆయా తేదీలలో వెరిఫికేషన్ చేయించుకోవచ్చన్నారు. వివరాలకు 8008583423, 8498066674 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

రైల్వేస్టేషన్లలో టీటీఐల తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో శుక్రవారం పలు రైల్వేస్టేషన్లలో టీటీఐలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వేకు అపరాధ రుసుం రూపంలో రూ.3.03 లక్షలు వసూలు చేసినట్లు డివిజన్ కమర్షియల్ మేనేజరు సోమశేఖర్ నాయుడు తెలిపారు. అలాగే ఎనిమిది మంది హాకర్లను రేణిగుంట రైల్వేకోర్టుకు హాజరు పరిచామన్నారు. రైల్వేస్టేషన్లలో మెడికల్ కార్డులు లేని అనధికార హాకర్లు వస్తు విక్రయాలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రేణిగుంట- కడప- గూడూరు- కాట్పాడి మార్గాల్లో ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. 605 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఏసీఎం ధనంజయకుమార్ సింగ్, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.రావు, కె.సుధాకర్‌లతోపాటు 36 మంది స్క్వాడ్ టీటీఐలు పాల్గొన్నారు.

స్కూటరిస్టు మృతి కేసులో ఆటోడ్రైవర్‌కు జైలుశిక్ష

తిరుపతి(లీగల్), జూన్ 28: ఓ స్కూటరిస్టు మృతికి కారణమైన మంగళంకు చెందిన ఆటో డ్రైవర్ సి.మురళీకి మూడు నెలల 15 రోజుల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. 2022 జనవరి 4వ తేదీన మంగళం హరితకాలనీకి చెందిన పి.స్వామినాధన్ స్కూటర్‌పై వెళ్తుండగా వెనుకనుంచి ఆటోతో డ్రైవర్ మురళి ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆపై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అలిపిరి పోలీసులు కేసు నమోదుచేశారు. కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

గురుకులాల్లో వసతులు కల్పించండి

నాయుడుపేట టౌన్, జూన్ 28 : గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని ఏబీవీపీ నాయకులు కోరారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి



కలెక్టర్, ఎమ్మెల్యేలకు సమస్యలను వివరిస్తున్న నెట్టేరి సర్పంచ్ సరోజమ్మ

నిండ్ర, జూన్ 28: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దీప అధ్యక్షతన నిండ్ర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను సర్పంచ్‌లు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మేళంబాకం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు కిలోమీటర్ దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ ఏళ్ల తరబడి ఖాళీగా ఉందన్నారు. నెట్టేరి సర్పంచ్ సరోజమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఆర్ కండ్రిగ సర్పంచ్ సంధ్యాదేవి మాట్లాడుతూ తమ గ్రామంలో నీరు ఉప్పుగా ఉందని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని, శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. కొప్పేడు దళితవాడలో తాగునీటి కాలుష్యం ఉందని తెలిపారు. ఇరుగువాయి సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ ఇరుగువాయి చెరువులో రంగునీరు కలువడంతో నీరు కాలుష్యం అవుతుందన్నారు. అంతకుముందు కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అజెండాలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై మండిపడ్డారు. ఇకమీదట అలా జరగకుండా చూసుకుంటామని అధికారులు చెప్పడంతో శాంతించారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవాని, తహసీల్దారు నాగమణి, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న తిలక్‌రాజ్ శర్మ

ముగిసిన చిరుధాన్యాల పరిశోధన సదస్సు

తిరుపతిరూరల్, జూన్ 28: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సు శుక్రవారంతో ముగిసింది. దీనిలో భాగంగా చిరుధాన్య పంటల ఉత్పాదకత పెంపు, ఆహార, పోషక భద్రత సాధించే దిశగా గత ఏడాదిలో చిరుధాన్య పంటల్లో చేపట్టిన పరిశోధనా ఫలితాలని విశ్లేషించి.. ఈసంవత్సరం చేపట్టాల్సిన కార్యాచరణపై విపులంగా చర్చించారు. అలాగే చిరుధాన్య పంట రకాల ఎంపిక కోసం ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ ఆధ్వర్యంలో వీఐసీ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ వాతావరణ వ్యవసాయ మండలాల్లో చీడపీడలని తట్టుకుని అధిక దిగుబడితోపాటు అధిక పోషక విలువలు కలిగిన రకాలు, వంగడాలను సాగుకు సిఫారసు చేసినట్లు ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి వివరించారు. రూట్ అండ్ రైజోస్ఫేర్ ఇంజనీరింగ్ ఫర్ డెవలప్పింగ్ క్లైమేట్ రీసిలియెంట్ క్రాప్స్‌పై తిరుపతి ఐసర్ అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరరామిరెడ్డి ఉపన్యసించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీ వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

టీటీడీ ఈవో శ్యామలరావు



జేఈవోతో మాట్లాడుతున్న శ్యామలరావు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి తిరుమలలోని పెద్ద, జనతా హోటళ్లపై సమీక్షించారు. సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖమైన హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడు చలేశ్వరరావు, తాజ్ హోటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించినట్టు తెలిపారు. దీనికిముందు తిరుమల ఎస్టేట్స్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలోని హోటళ్ల గురించి వివరించారు. అలాగే ఐటీ విభాగం భక్తులకు అందిస్తున్న వివిధ సేవల గురించి జియో బృందంతో ఈవో సమీక్షించారు. అనంతరం ఆలయ సిబ్బంది, పోటు కార్మికులతో సేంద్రియ ప్రసాదాలపై సమావేశం నిర్వహించారు. డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఐజీ మేనేజర్ నాదముని, జియో సంస్థ ప్రతినిధులు మోషిన్ అబ్బాస్, విజయ్‌కుమార్, మంజీత్, పోటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనంలో తనిఖీలు

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలను స్వయంగా పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. స్వయంగా కొన్ని అన్నప్రసాదాల రుచిని పరిశీలించారు. భక్తుల సూచన మేరకు అన్నప్రసాదాలను మరింత రుచిగా అందించాలని అధికారులను ఈవో ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే 'తల్లికి వందనం' ఇవ్వాలి

- ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం



క్యాంపెన్ చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట, జూన్ 28 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే అందజేయాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు క్యాంపెన్‌లో భాగంగా శుక్రవారం నాయుడుపేట ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే ఈ పథకాన్ని అందజేయడం ద్వారా పేద విద్యార్థులకు మంచి జరుగుతుందన్నారు. జీవోనెంబరు 117ను రద్దుచేయడం ద్వారా ప్రాథమికోన్నత పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని తద్వారా గ్రామీణ, పేద విద్యార్థులకు సమీపంలోనే విద్యాభ్యాసాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు సీహెచ్ అల్లెయ్య, రజనీబాబు, మస్తానయ్య, శ్రీహరిరాజు ఉన్నారు.

సీనియర్ సహాయకురాలికి సన్మానం

కోట, జూన్ 28: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎన్.దేవకికి సన్మాన సభ జరిగింది. మండల పరిషత్ సిబ్బందితోపాటు ఎంపీపీ అంజమ్మ, ఎంపీడీవో శంకరయ్యలు దేవకిని షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. విధుల్లో ఆమె చేసిన సేవలను కొనియాడారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

చిల్లకూరు, జూన్ 28: మండలంలోని మన్నెగుంటలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్సపొందుతున్న నాగరాజమ్మ(33) శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన నాగరాజమ్మ ఆమె నివాసానికి సమీపంలోని తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజమ్మను స్థానికులు, కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు.

ప్రమాదకరంగా కల్వర్టులు



బాలుర ఉన్నతపాఠశాల సమీపంలో రక్షణగోడ లేని కల్వర్టు

గూడూరు, జూన్ 28: పట్టణంలో పలు పంట కాలువలు, ప్రధాన కాలువలపై గతంలో నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలను అభివృద్ధి పరచకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలో పంటకాలువలు, డ్రైనేజీకాలువలపై రాకపోకలు సాగించేందుకు గతంలో కల్వర్టులను నిర్మించి రక్షణ గోడలను ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమంలో రోడ్లను అభివృద్ధిపరచడంతో కల్వర్టులపై కూడా రోడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రక్షణ గోడలు రోడ్డుకు సమాంతరంగా ఉన్నాయి. రక్షణ గోడల ఎత్తును పెంచకపోవడంతో అవి రోడ్డుకు సమాంతరంగా ఉండి కనిపించడం లేదు. బాలాజీనగర్‌కు వెళ్లేమార్గంలో, డీఆర్‌డబ్ల్యూ కళాశాల సమీపంలో, జడ్పీబాలుర ఉన్నతపాఠశాల సమీపంలో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో కల్వర్టుల వద్ద రక్షణగోడల ఎత్తు పెంచకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. స్థానిక రాణిపేటకు వెళ్లే మార్గంలోని నాయుడుకాలువ వద్ద కొన్నేళ్ల క్రితం రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద రక్షణగోడలను అభివృద్ధిపరిచి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

తడ, జూన్ 28 : స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా క్యాన్సర్ చికిత్స శిబిరం నిర్వహించారు. సూళ్లూరుపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతోపాటు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకయ్యబాబు,లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసశెట్టి, క్యాంప్ ఛైర్మన్ అరుణకుమారి, సిబ్బంది రెడ్డి కుమారి, మహేంద్ర, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా గురుకులాల్లో ఖాళీల భర్తీ

దక్కిలి, జూన్ 28 : దక్కిలిలోని గురుకుల పాఠశాలలో ఖాళీగా వున్న సీట్ల భర్తీ విషయంలో పాదర్శకంగా వ్యవహరించామని ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గరుకుల ప్రవేశాల్లో విద్యార్థులకు అన్యాయం జరిగిందని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు మునెయ్య చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. పేదరికాన్ని, ప్రతిభను అర్హతగా తీసుకొని విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. 7, 8 తరగతుల్లో సీట్లు ఖాళీ లేకపోవడం వల్లే వాటికి పరీక్షలు నిర్వహించలేదన్నారు.

డ్రైనేజీ ఇలా...మురుగు పారేదెలా ?



తోలిమిట్ట దారిలో డ్రైనేజీ పూడిన కాలువ

వెంకటగిరిటౌన్, జూన్ 28: పట్టణంలోని తోలిమిట్ట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షకాలంలో మురుగు పారకపోతే దోమలు స్వైరవిహారం చేస్తాయని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ పందుల సంచారం ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది చెత్తను జేసీబీతో ఎత్తడంతో అక్కడ గుంత పడడంతో వర్షపు నీరు నిలిచి దుర్వాసన వస్తుందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువులో రసాయన వ్యర్థాలు



చెరువులో ఉన్న వ్యర్థాలు - కలుషితమైన నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28: మండలంలోని నెలవాయి చెరువులో ఓ పరిశ్రమ రసాయన వ్యర్థాలు వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రసాయన వ్యర్థాల వల్ల చెరువులో నీరు కలుషితమై పంటలు దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా గ్రామంలోని పశువులు ఈ చెరువులోనే నీళ్లు తాగుతాయని, రసాయన వ్యర్థాల వేయడం వల్ల పశువులు మృతి చెందే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెరువులో రసాయన వ్యర్థాలు వేయకుండా చూడాలని నెలవాయి గ్రామస్తులు కోరుతున్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్‌సేవ



నారాయణవనం, జూన్ 28: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణతో ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయి పూజ

శ్రీకాళహస్తి, జూన్ 28: అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తొట్టంబేడు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిపూజ అన్నారు. తొట్టంబేడు మండలంలోని లింగనాయుడుపల్లిలో పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. పాఠశాలలోని తాగునీటి వనరులు పరిశీలించారు. నీటి కలుషితం వల్ల ఏర్పడే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో సంచరించి నీటి కలుషితం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌వో పద్మ, ఏఎన్‌ఎం నాగరాజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త గుడ్లూరు సుజాత, ఆశా వర్కర్లు విజయ, నాగభూషణమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28: వర్షాకాలంలో డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి దివాకర్ అన్నారు. మండలంలోని కాంపాళెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పైపులైను లీకేజీలు, మురుగునీటి కాలువలు శుభ్రం చేయించడం వల్ల డయేరియాను నిర్మూలించవచ్చన్నారు. కలుషిత ఆహారం, నీటిని తీసుకోవడం వల్ల డయేరియా వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు వక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సర్పంచు మాచాలమ్మ, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యులు ఉదయ్‌కుమార్, ద్వైత ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శారద, ప్రధానోపాధ్యాయుడు మాధవయ్య, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం సెల్వకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చంద్రప్రకాష్‌కు డాక్టరేట్



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 28: శ్రీకాళహస్తి మండలం పాపనపల్లెకు చెందిన సి.చంద్రప్రకాష్ ఎస్వీయూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆ వర్సిటీ జువాలజీ విభాగంలో 'కమ్యూలేటివ్ బెనిఫిషియల్ ఎఫెక్ట్ ఆఫ్ బోత్ అలోవేర అండ్ మ్యాంగో పల్ప్ ఆన్ కార్డియాక్ అండ్ రీనల్ బయోకెమికల్ అండ్ ఆక్సిడేటివ్ స్ట్రెస్ ఎంజైమ్స్ ఇన్ స్ట్రెప్టోజోటోసిన్ ఇండ్యూస్డ్ డయాబెటిక్ ర్యాట్స్' అంశంపై ప్రొఫెసర్ ఎం.భాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీతఈ దామ్లానాయక్ తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, జూన్ 28: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువుతీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్టు



పట్టుబడ్డ నిందితుడు, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు

శ్రీకాళహస్తి/కేవీబీపురం, జూన్ 28: ఎర్రచందనం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన మోహన్ అరవి అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ తెలిపారు. శుక్రవారం శ్రీకాళహస్తి అటవీశాఖ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. కేవీబీపురం మండల పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో శ్రీకాళహస్తి రేంజ్ అధికారి లోకేష్, డిప్యూటీ రేంజర్ రామకృష్ణ సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. గురువారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో సుమారు రూ.10 లక్షల విలువైన 17 ఎర్రచందనం దుంగలు ఉండడంతో అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నిందితుడు తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడికి చెందిన మోహన్ అరవిగా గుర్తించారు. వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను సీజ్ చేశారు. మోహన్ అరవిని రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ వాహనానికి ఎస్కార్ట్‌గా వచ్చిన మరో వాహనం అధికారుల కళ్లుగప్పి పరారైనట్లు వెల్లడించారు. ఎర్రచందనం అక్రమ రవాణా వెనుక ఉన్న పాత్రధారులను కూడా గుర్తించి చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది రమణ, వెంకటేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

వైసీపీ నేత అక్రమ నిర్మాణానికి మినహాయింపు ఎందుకో?



వైసీపీ నేత నిర్మించిన భవనం

శ్రీకాళహస్తి, జూన్ 28: ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యుడుగా వ్యవహరించిన ఓ వైసీపీ నేత అక్రమ నిర్మాణంపై అధికారులు వ్యవరిస్తున్న తీరు పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లోని ఇళ్ల స్థలాలను ప్రభుత్వం పేదల కోసం కేటాయించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడ్డారు. పేదల కోసం కేటాయించిన స్థలంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడుగా పనిచేసిన ఓ నేత బహుళ అంతసుల భవనం నిర్మించాడు. సెటిల్‌మెంట్ స్థలాలు అయినప్పటికీ ముందుగా ల్యాండ్ కన్వర్షన్, బిల్డింగ్ అప్రూవల్ కోసం యజమానులు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వానికి రుసుం కూడా చెల్లించాల్సి ఉంటుంది. పేదల కోసం కేటాయించిన ఇళ్ల స్థలంలో అనుమతి లేకుండా వైసీసీ నేత భారీ బహుళ అంతస్థుల భవనాన్ని నిర్మించాడు. ఇటీవల ఈ భవనానికి సమీపంలో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న పనసకాల్వ పోరంబోకు స్థలంలో నిర్మించిన సుమారు వంద అక్రమ నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. కానీ వైసీపీ నేత భవనం వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. దీనిపై పెద్దఎత్తున సామాజిక మాధ్యమాల్లో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పేదల స్థలాలను విక్రయించి సంపాదించిన అక్రమ సొమ్ముతో వైసీపీ నేత చెలరేగిపోయారని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. అలాంటి అక్రమ భవనాన్ని మాత్రం అధికారులు ఎందుకు వదిలేశారంటూ సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ఈవీఎం గోదాములో జేసీ తనిఖీలు

రేణిగుంట, జూన్ 28: ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలను భద్రపరచిన గోదామును జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం రాజకీయ పార్టీల నాయకులతో కలిసి రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములో భద్రపరచిన ఈవీఎం యంత్రాలను తనిఖీ చేశారు. భద్రత, సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలించారు. ఆయన వెంట డీఆర్వో పెంచల కిషోర్, ఈవీఎం గోదాము ఇన్‌ఛార్జి, ఎస్‌డీసీ కోదండరామిరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సత్యవేడు, జూన్ 28: సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్, ఇంచార్జి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకు పీఎల్‌సీ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించు కోవచ్చన్నారు.

ప్రభుత్వ స్థలం ప్రహరీ కూల్చివేత ముగ్గురిపై కేసు నమోదు

ఏర్పేడు, జూన్ 28: ఏర్పేడు మండలం గుండ్లకండ్రిగ పంచాయతీలో సర్వే నెంబరు 70లో ఉన్న ప్రభుత్వ స్థలానికి ప్రహరీ నిర్మించారు. ఆ ప్రహరీని అదే గ్రామానికి చెందిన ముగ్గురు ఈనెల 16వ తేదీన ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన విజయభాస్కర్, శ్రీధర్, చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 28: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 28: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్రనామం పఠించారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈవో బాలాజీ

ఏర్పేడు, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని డీవైఈవో కొల్లు బాలాజీ అన్నారు. ఏర్పేడు మండలం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో అడ్మిషన్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన విద్యార్థి కిట్లను అందరికీ అందేలా చూడాలన్నారు. అదేవిధంగా పీఎంశ్రీ, సీబీఎస్‌ఈ పాఠ్యాంశాలను, కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం డీవైఈవో బాలాజీని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎంఈవో-2 భాస్కర్‌నాయక్, విద్యాకమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కేవీ బాబు, రెడ్డెప్ప, రామచంద్రయ్య, సుబ్రహ్మణ్యం, మెహర్‌బాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

శ్రీకాళహస్తి, జూన్ 28: రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు సంతకం చేయడం హర్షణీయమని జనసేన పార్టీ లీగల్‌సెల్ సభ్యుడు న్యాయవాది సాయిరాం విప్పరపల్లి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లోపభూయిష్టంగా ఉందని, ఈ చట్టం భూయజమాన్య హక్కులకు తీవ్ర విఘాతం కలిగించే విధంగా ఉందన్నారు. ఈ చట్టాని రద్దు చేయాలని ప్రజాసంఘాలు, న్యాయవాదులు నిరసన తెలిపినా గత వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఓటమి చవి చూసిందని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవడం హర్షణీయమని చెప్పారు.

బాలికల వసతిగృహంలో వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, జూన్ 28: పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం-1, 2లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు లహరి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనందరావు, పీహెచ్‌ఎన్ సంపూర్ణమ్మ, ఏఎన్‌ఎం సుధ, ఆశా వర్కర్ మంజుల, వసతిగృహ సిబ్బంది హేమలత పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు ఆదర్శనీయం: డీఈవో

పిచ్చాటూరు, జూన్ 28: మండలంలోని కీళపూడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు సేవలు ఆదర్శనీయమని డీఈవో శేఖర్ అన్నారు. వెంకటేశ్వర్లు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. శుక్రవారం ఆయనను డీఈవో శేఖర్, ఉపాధ్యాయ వాణి సంపాదకుడు గాజుల నాగేశ్వరరావు, ఎంఈవో హేమమాలిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వెంకటేశ్వర్లు సేవలు, ఆయన విద్యార్థులపై చూపిన ప్రేమ ఆదర్శనీయమని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



గ్రామకంఠం ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

పిచ్చాటూరు, జూన్ 28: పిచ్చాటూరు మండలం అడవి కొడియంబేడు వద్ద 0.20 సెంట్లు గ్రామకంఠం భూమిని వైసీపీ నాయకులు కుమార్, డేవిడ్ ఆక్రమించుకున్నారని అదే గ్రామానికి చెందిన దమయంతి ఆరోపించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గ్రామకంఠం భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించుకోవడంతో తమ కుటుంబ సభ్యులకు చెందిన సర్వే నెం.190/6 0.13 సెంట్ల పట్టా భూమికి దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోండంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోవడంలేదని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామకంఠం భూమిని ఆక్రమించుకున్న వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వలేదు: టీడీపీ

శ్రీకాళహస్తి, జూన్ 28: మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని.. స్పీకర్ ఎలా ఇస్తారని టీడీపీ తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎవరిని ఎక్కడ కూర్చోబెట్టాలో ప్రజలే నిర్ణయించారన్నారు. ఏ నిబంధన చూసినా వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని స్పష్టం చేశారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చిటికేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదని శాసనసభ సాక్షిగా వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు.

కల్కి ఆక్రమిత భూములను అప్పగించండి

వరదయ్యపాళెం, జూన్ 28: కల్కి ఆశ్రమ భూములను దళితులకు అప్పగించకుండా అధికారులు ఎన్నాళ్లు నాటకాలు ఆడుతారని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం పంచాయతీలో దళితులకు సంబంధించిన భూములను కల్కి ఆశ్రమం ఆక్రమించిందన్నారు. దీనిపై బాధితులు 20 సంవత్సరాలుగా పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. హైకోర్టులో తీర్పు రైతులకు అనుకూలంగా వచ్చినా అధికారులు కాలయాపన చేస్తున్నారని చెప్పారు. అధికారులు కల్కి వద్ద నుంచి భూములను స్వాధీనం చేసుకుని రైతులకు నష్టపరిహారంగా రూ.60 లక్షలు ఇప్పించాలని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

వరదయ్యపాళెం, జూన్ 28: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరులో స్వచ్ఛ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు మావుడూరు మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రాచర్ల, వెంకటాపురం, అంబికాపురం, పాండూరు, తొండంబట్టు, బత్తలవల్లం, ఇరుగుళం, మాధనపాళెం తదితర గ్రామాల నుంచి వచ్చిన 164మందికి చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వైద్యబృందం కంటి పరీక్షలు నిర్వహించింది. 54మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాగార్జున, బండారి, జయశంకర్‌రెడ్డి, సర్పంచు శ్యామల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ భువనేశ్వరి, విజయకుమార్, యశ్విన్, వైద్యులు మునిరాము, లీజిరాజ్ పాల్గొన్నారు.

గో పాలం ఆక్రమణపై ఫిర్యాదు

కేవీబీపురం, జూన్ 28: మండలంలోని మోరీస్‌కండ్రిగ గ్రామంలో సర్వే నెంబరు 247లో 7.50ఎకరాల ప్రభుత్వ భూమి గోపాలంగా ఉంది. ఈ భూమిని గ్రామ దేవతలైన బంగారమ్మ, చెల్లమ్మ ఆలయాల కోసం 2014లో అగ్రిమెంట్ చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది దొంగ పట్టాలు సృష్టించుకుని ఆక్రమించడంతో డీటీ మునిరత్నం, ఏఎస్ఐ లోకనాధానికి గ్రామస్థులు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

పుత్తూరు వార్తలు

గిడ్డంగిని తనిఖీ చేసిన జేసీ



గిడ్డంగిని పరిశీలిస్తున్న జేసీ

పుత్తూరు, జూన్ 28: పుత్తూరులోని నిత్యావసర వస్తువుల గిడ్డంగిని జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. గిడ్డంగిలోని స్టాక్, రికార్డులను పరిశీలించారు. జూలై నెలకు సంబంధించి నిత్యావసర వస్తువులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, గిడ్డంగి ఇన్‌చార్జి డీటీ విష్ణువర్మ, ఇన్‌చార్జి ఆర్ఐ గురుస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు సన్మానం

పుత్తూరు అర్బన్, జూన్ 28: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను గేటుపుత్తూరుకు చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డీఎస్ గణేష్, నాయకులు జేసీబీ బాబు, మునిరాజా ఆచారి, మురళి తదితరులు పాల్గొన్నారు.



భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఈ దారిలో వెళ్లేదెలా?

- అధ్వానంగా చింతకాల్వ రోడ్డు
- వర్షం వస్తే కాలువలా దారి



వర్షపునీటి నిల్వతో కాలువలా మారిన చింతకాల్వ రోడ్డు

వడమాలపేట, జూన్ 28: వడమాలపేట మండలంలోని పత్తిపుత్తూరు నుంచి చింతకాల్వకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. కిలోమీటర్ పొడవున్న దారిలో సిమెంటు రోడ్డు నిర్మించేందుకు రెండేళ్ల క్రితం అడుగు లోతున తవ్వారు. అయితే పనులు పూర్తి చేయకుండా ఆపేశారు. దీంతో దారి మొత్తం కాలువలా మారింది. వర్షం పడితే నీళ్లు ఎటూ వెళ్లలేక నిల్వ చేరుతున్నాయి. ఫలితంగా దారి మొత్తం కాలువను తలపిస్తోంది. నీళ్లు తగ్గినా బురద పేరుకుపోతుండడంతో కనీసం నడవలేదని పరిస్థితి. చింతకాల్వ నుంచి పత్తిపుత్తూరు ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. అధికారులు స్పందించి పత్తిపుత్తూరు నుంచి చింతకాల్వకు వెళ్లే రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సన్మానం



పుత్తూరు అర్బన్, జూన్ 28: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌ను పుత్తూరు మండలం కేబీఆర్ పురం పంచాయతీ రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు లక్ష్మీపతి రాజు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ

వడమాలపేట, జూన్ 28: మండలంలోని ఎస్‌వీ పురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం దాతలు నోటు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి అందజేశారు. స్థానికులు శ్రీనివాసవర్మ, యువశ్రీ దంపతులు తమ తల్లి ధనలక్ష్మి జ్ఞాపకార్థం రూ.25 వేల విలువ కలిగిన విద్యాసామగ్రి వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రకాశం, ఉపాధ్యాయులు సుదర్శన్, రంగయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు